



# భజన

మంత్రి యోగేశ్వరరావు

"భజన చేస్తేనే గాని భగవంతుడు కూడా ప్రసన్నుడు కాడు. దానికితోడు అష్టోత్తర, శత, సహస్రనామాలతో ఆయనను స్తుతించాలి. షోడశోపచారాలు చేయాలి. పత్రం, పుష్పం, ఫలం, తోయాలతో తృప్తి పడగలడని నమ్మకం లేదు. మహానైవేద్యం సమర్పించాలి. త్రివిధ భక్తులు చాలవు. నవ విధ భక్తులతో సేవించి ప్రీతిపాత్రుడైతే కోరిన కోరికలలో కొన్నిటిని తీరుస్తాడేమో? భగవంతుని సంగతే అలా ఉంటే అధికారుల వద్ద కోరికలు తీర్చుకోవటానికి భజన చేయడంలో తప్పేముంది? ఈ భజన అనేది ఆనాటి నుంచి ఈనాటివరకే గాక ఏనాటివరకైనా ఉండక తప్పదు" అంటాడు తనను కదిలించిన వారితో భజన్‌లాల్.

అతని తల్లిదండ్రులు పుట్టిన మొదటి నెలలో పసిడితోప్రాలపై రాసిన వ్యవహార నామం భాస్కరరావు. ఉద్యోగంలో చేరిన మొదటి నెలలో ఫ్రెండ్స్ పెట్టిన గుప్తనామం భజన్‌లాల్. అతన్ని ఎవరైనా భజన్‌లాల్ అని ఎదురుగా పిలిచినట్లయితే సవాలక్ష వడ్డిస్తాడు. పనులు చేయించుకోవడం చేతగాని చవట వంటాడు.

ఏ రాజకీయ నాయకుడినైనా, ఉన్నతోద్యోగినైనా సమయ సందర్భాలు కనిపెట్టి ఉక్తిప్రయుక్తులతో మంచి చేసుకోవడం భజన్‌లాల్ నేర్పు. షోడశోపచారాలలో ఆయన షడ్విధోపచారాలు ఎన్నుకొన్నాడు. ప్రదక్షిణం, నమస్కారం, ఆవాహనం, ఆసనం, పుష్పం, నైవేద్యం వాటి క్రమం. త్రికాల సంధ్యావందనం చేసినట్లు మూడు వేళలా నమస్కారం చేయడం, నిలబడి, వంగి, కూర్చొని సేవలు చేయడం ఆయన అలవాటు. నవవిధ ప్రేమోదయావస్థలు బాగా తెలుసు. అందులో భజన ప్రక్రియ క్రమం బాగా ఎరిగినవాడు. పోయే ఆఫీసర్ వచ్చే ఆఫీసర్‌కు భాస్కరరావ్‌ను నమ్మకస్థునిగా పరిచయం చేస్తారు. భాస్కరరావులో ఉండే క్వాలిఫికేషన్స్ మరెవరిలో లేవు. చూడగానే కనిపించేది రూపం. కదిలిస్తే కనబడేది జ్ఞానం. విధులలో తెలుస్తుంది వినయం. ఆపదలో తెలుస్తుంది ఆదరం. ఆచరణలో తెలుస్తుంది అభిరుచి. కార్యాల్లో తెలుస్తుంది కార్పణ్యం. మాటల్లో తెలుస్తుంది మనస్తత్వం - అని తెలిసిన భాస్కరరావు తన మనోభావాలను మరుగుపరిచి, అధికారులకు అర్థం కాని రీతిలో అన్ని లక్షణా లున్నట్లు తోపింపజేస్తాడు.

భాస్కరరావుది మేలిమిబంగారు శరీర చాయ. ఎత్తుకు తగ్గ లావు. నవ్వుతూ ఉండే కోలముఖం. ఎబ్బెట్టుగా లేని వేషం. ఎదుటి వారిని ఆకర్షించే చూపులు. చక్కదనంతో పాటు చిక్కని చక్కని వ్రాయసకాడు. డ్రాఫ్ట్ రాస్తే అనేకసార్లు చదవాలనిపించే ముచ్చటైన పదజాలం అతని స్వంత సొమ్ము. మైమరపించే మాటలు చెప్పడం అతనికి దేవు డిచ్చిన బహుమతి. అతని మాటలు వినేవారికి 'భజన' అనిపించదు. మూడు భాషల్లో సమయస్ఫూర్తిగా మాట్లాడగల మూర్తి.

అవకాశాన్ని సావకాశం చేసికొనడంలో భాస్కరరావుది పైచేయి. పైసా లేరుకోవడం బిచ్చగాడి లక్షణ మంటాడు. అందినప్పుడు హుందాగా వందలే కాజేయడం, పక్కవారికి వినపడకుండా, కనపడకుండా చేయడం, చేయించడం, ఇచ్చినవాడు నొచ్చుకోకుండా మెచ్చుగా, ఖర్చు తక్కువతో ఎక్కువసార్లు తిప్పక

పంపడం భాస్కరరావులో ఉండే చాకచక్యం. భాస్కరరావు చూపే త్రివిధ భక్తులకు దాసోహమనని అధికారి ఉండడు. ఏకాంత సేవనంలో అవసరమైతే పాదాభివందనంలో భాస్కరరావు అగ్రగణ్యుడు. పనిలో శక్తి పలుకులలో భక్తి ఎట్టివారికైనా అతనిపైన అనురక్తి, ఆసక్తి కలిగించకపోవు. దర్పం, దౌర్జన్యం, అహం, ఆగ్రహం మచ్చుకైనా లేవని మెచ్చుకొనేటట్లు ప్రవర్తించడం అతని నైపుణ్యం.

భజన్‌లాల్ పట్టుకొన్న పని కాకపోదని అందరికీ తెలుసు. డబ్బు కక్కుర్తి మనిషి కాదనిపించుకొంటాడు. ఎక్కడంటే అక్కడ మాట్లాడడు. ఎక్కడంటే అక్కడ ఇస్తే తీసికొనడు. దుడ్డుకోసం గడ్డి తినే మనిషి కాదనిపించుకొంటాడు. చేయదలచుకొంటే చేతకానిది లేదు. తెలియని జీ.ఓ. లేదు. మాటకు తిరుగులేదు. అనుభవించని భోగం లేదు. అధిరోహించని వాహనం లేదు. కొనని వస్తువు లేదు. లక్షలు గడించాడు. భాస్కరరావుకు అది యోగకాలం. ఆ యోగంలో భాగంగా అధికార్ల మన్ననవల్ల ఆఫీసర్ ప్రమోషన్ వచ్చింది.

ఇప్పుడు భాస్కరరావు ఒక ఆఫీసర్. భజన చేసే కాలం పోయింది. భజన చేయించుకొనే స్థితి వచ్చింది. తా నిదివరకు జూనియర్ అసిస్టెంటు, సీనియర్ అసిస్టెంటుగా పని చేసే కాలంలో ఆర్జనలో ఆఫీసర్‌కు, తనకు ఫిఫ్టీ ఫిఫ్టీ. ఇప్పుడు ఎవరికీ భాగం లేకుండా పూర్తి మొత్తం తానే పొందాలనే స్థితికి ఎదిగాడు.

"గుడ్ మార్నింగ్ సార్" అన్నాడు శాస్త్రి. ఆ ఆఫీసులో సీనియర్ అసిస్టెంటు.

శాస్త్రివైపు చూసి తలూపాడు భాస్కరరావు ఏమిటన్నట్లు.

దేవునికి నమస్కరించి పోయే భక్తునిలా వెళ్ళాడు శాస్త్రి.

వీడు నన్ను కాకా పడుతున్నట్లుంది. మూడువేళలా నమస్కారం చేయడం, పని ఉన్నా లేకున్నా ప్రదక్షిణాలు చేయడం, హొటలుకు రమ్మని, భోజనానికి రమ్మని, సినిమాలకు రమ్మని ఆహ్వానించడం, వచ్చిన రోజు పూలదండ వేయడం, కాఫీ ఫలహారాలు, ఆపిల్స్ తెచ్చిపెట్టడం, కరిమిడిగ మాట్లాడడం-ఇవన్నీ భజనకు ప్రారంభ లక్షణాలే అనుకొన్నాడు భాస్కరరావు.

శాస్త్రి ఏదో ఫైలు తెచ్చి ముందు పెట్టి, రెండు వందలు డ్రాయర్‌లో వేశాడు.

"ఏమిటది?" ప్రశ్నించాడు ఆఫీసర్ హొదాలో భాస్కరరావు. "నిన్న మీతో కలిసినతను తమరికి సమర్పించమని ఇచ్చిన..." నసిగాడు శాస్త్రి.

"అత నిచ్చిన మొత్తమెంత?" గదిమినట్లు పలికాడు భాస్కరరావు.

"నాలుగు" అన్నాడు శాస్త్రి.

"ఇదిగో శాస్త్రీ ! నేను వచ్చిన మూడు రోజులలోనే నీ భజనను గుర్తించాను. తక్కిన రెండూ?" అన్నాడు భాస్కరరావు.

"ఇవిగో... సార్!" పర్సులోని రెండు వందలు తీసిచ్చాడు శాస్త్రి.

ఫైలుమీద సంతకం పెట్టి పక్కకు నెట్టాడు భాస్కరరావు. చిన్నబోయిన ముఖంతో ఫైలు పట్టుకొని వెళ్ళి సీట్లో కూర్చున్న శాస్త్రి ఆలోచించాడు. ఎవరు భజనపరులైందీ అందరికీ తెలుసు. వీడు నన్ను భజనపరు డంటాడా? ఈ శాస్త్రి సంగతి వీడికి తెలియదు. ఈ కోడెనాగు కాటేయక మానదు. ఏదో ఆలోచన వచ్చినట్లు తనలో తాను తలూపుకొన్నాడు. అంతే.

వారం తిరగకముందే శాస్త్రి ఆఫీసుకు వచ్చేవరకు అందరూ గుంపుగా చేరి అనుకొంటున్నారు - "భాస్కరరావ్‌ను అరెస్ట్ చేశారని."

"ఏమి టీ విషయం? ఏం జరిగింది?" ప్రశ్నించాడు శాస్త్రి పక్క సీటు గోపీని.

"మన ఆఫీసర్ భాస్కరరావు ఇంట్లో ఎవరి దగ్గరో వెయ్యి రూపాయలు లంచం తీసుకొనేటప్పుడు క్రైంబ్రాంచి వారు ట్రాప్ చేశారు. లక్ష రూపాయలు కాళ్ళముందు పోస్తానన్నా ఆఫీసర్ చక్రధర్ వదల్లేదట" అన్నాడు గోపి.

శాస్త్రి మేనమామే చక్రధర్ అనే విషయం ఎవరికీ తెలియదు.

తాను తొందరపడి ఒకరి జీవితాన్ని పాడుచేశానేమో - లోలోపల అనుకున్నాడు శాస్త్రి.

భాస్కరరావు తన కేసు మాఫీకోసం, సంపాదించిన మొత్తం వ్యవహారంలో ఖర్చు చేశాడు. అతనికి యోగకాలం పోయింది. ఉద్యోగం నుంచి డిస్మిస్ చేశారు.

పడక కుర్చీలో పడుకొని ఆలోచించే భాస్కరరావుకు "వెనుకటి జీవితాన్ని మరచి, వచ్చిన ప్రమోషన్ ఇంద్రపదవి అనుకొని తన కింది ఉద్యోగులను నీచంగా చూడడం తప్పు, అందరూ తనలాంటి బుద్ధి కలవారే [భజనపరులే] అనుకోవడం రెండవ తప్పు, అన్యాయార్జితం మూడవ తప్పు. సాటి మానవునకు భజన చేయడం జీవితంలో చేసిన పెద్ద తప్పు" అని అంతరాత్మ అతనికి ప్రబోధించింది. ✱

# రావిచెట్టు

సాయంత్రం పాత దృశ్యం మాయమై
కొత్త దృశ్యానికి తెర తీసినట్లు
పక్షుల వరస పక్కగా సాగిపోయింది

పాలిష్ పెట్టిన నీలాల నింగిలో వజ్రాల పొడి చల్లినట్లు
స్వచ్ఛంగా నక్షత్రాలు,
కొత్త లోకాల్ని కనుక్కొని ఆనంద తీరానికి వస్తున్న
ఆశాజీవుల ఆహ్లాద నౌకలా అర్ధచంద్రుడు,
ఆకాశానికి లేచి ఆగిపోయిన అలల్లా
గంభీరం ధ్వనించే కొండల వరస.

కొండల ముందు కొత్తగా యవ్వనంలోకి అడుగిడినట్లు
అణువణువూ చిగురించి గల గలా కదిలే రావి చెట్టు

గంధర్వ లోకం నించీ వొచ్చిన గానం
కొమ్మ కొమ్మలో రెమ్మ రెమ్మలో గూడు కట్టినట్లు
రక్తాన్ని ఆకర్షించే, నరాల్ని మంత్రబద్ధం చేసే
కళ్ళని కాంక్షల్తో కవ్వించే
ఆకాశ మంత రావి చెట్టు అద్భుత దృశ్యం

చివురు చివురులో పసుప్పచ్చని పొగలు చిమ్ముతున్న
పారదర్శక పారవశ్యం వశం చేసుకుంటుంది.
లక్ష చివుర్ల పెదాలతో మృదువుగా కంపిస్తుంది.
లక్ష చేతుల్తో కౌగిలించుకోనున్నట్లు కదుల్తుంది.
లక్ష స్వర్ణ దీపాల దీపస్తంభంలా స్తంభింప జేస్తుంది.

సత్యానికి అభిముఖమయ్యే క్షణాల్లో
సౌందర్యానికి తలవంచే మనిషిలో
రోజు కో వసంతం పుడుతుందని
రావి చెట్టు గుర్తు చేస్తుంది.

- సౌభాగ్య